# డాక్టరు శాంతి

సర్జన్ సురేశ్ శాంతి జైలులోఉందని పేపర్లో చూసి విభ్రాంతుడయ్యాడు.

''ఏంజరిగి ఉంటుంది? శాంతి ఏంచేసి ఉంటుంది? నిరాడంబరంగా నమ్రతతో, అందరితో స్నేహభావంతో మెలిగే శాంతికి జైలుశిక్ష?"

''పేదరికంలో పుట్టి, తండ్రి లేకపోయినా తల్లిని ఒప్పించి, పల్లెటూళ్లో చదివి పదవక్లాసులో రాష్ట్రానికంతకూ ప్రథమురాలిగా వచ్చింది. తనకు గుంటూరు మెడికల్ కాలేజీలోనే పరిచయం. అది కూడా నోటిమాటలేని పరిచయం."

చదువుకోవటానికి పుస్తకాలు లేవు. కొనటానికి డబ్బులేదు. విద్యార్థినులు చాలామంది ఉన్నారు కాని, వాళ్ళనడగటానికి ముఖమాటం పాత పుస్తకాలమ్మే దుకాణానికి పోతే దొరుకుతాయేమో? కాని తగినంత డబ్బు లేనట్టుగా ఎవరికీ చెప్పదు. ఆమె ముఖంచూసి ప్రొఫెసరు తన గదిలోకి పిలిచి "నీబాధ ఏమిటమ్మా? నీ తండ్రివంటివాడిని నాతో చెప్పు. నాకు చేతనయినంత సహాయం చేస్తా"నన్నాడు ఒకరోజున.

కళ్ళనీళ్ళు పైకి జారనివ్వకుండా రెప్పలతో అదిమిపెట్టి ''నాకు సీటు వచ్చింది కదా అని కాలేజిలో చేరానుసర్. మా అమ్మ విస్తళ్ళుకుట్టి, మిఠాయి దుకాణంలో పనిచేసి నన్ను చదివించింది. పదవక్లాసు ప్యాసయిన తరువాత నేను ఒక ఏడాది అక్షరాస్యతా పథకంలో పేదపిల్లలకూ పెద్దవాళ్ళకూ అక్షరాలు నేర్పించటానికి నెలకు నూరు రూపాయల జీతంతో నియమింప బడ్డాను. అక్కడి నుంచి ఊళ్ళోఉన్న పాఠశాలకు బదిలీ అయింది. ఆ జీతంతో ఊళ్ళోనే ఇంటర్ చదివాను. అప్పుడు స్నేహితుల దగ్గర పుస్తకాలు తీసుకుని చదువుకునే దాన్ని. కొందరు నోట్సు ఇచ్చేవారు. ఇప్పుడు అమ్మ వద్దంటున్నా ఈ కాలేజిలో చేరాను. తోటివిద్యార్థినులతో కొంత పరిచయమయితే నెట్టుకురాగలను. అంతవరకు...."

''సరే, ఇప్పుడు పరిస్థితి అర్థమైంది. నీకు అన్నివిధాలా సహాయంచేయ గల విద్యార్థిని పరిచయంచేస్తానని'' సురేంద్రను పిలిపించాడు.

''సురేంద్రా, నీవు సెకండియరు విద్యార్థివి. ఈ అమ్మాయి కొత్తగా చేరింది. పుస్తకాలు కొంచెం సర్దుబాటు చెయ్యి. అమ్మాయి చాలా ముఖమాటస్తురాలు. తనంతటతాను అడగలేక ఇబ్బంది పడుతోంది.

"కిందటి సంవత్సరం పుస్తకాలు నాదగ్గర ఉన్నాయి సర్. రేపు తీసుకు వచ్చి ఇస్తాను'' అన్నాడు తలవంచుకుని.

ప్రొఫెసరే ఒకరినొకరికి పరిచయం చేశాడు. అప్పుడు కళ్ళెత్తి అయస్కాంతం లాంటి చూపులతో, కళకళలాడుతున్న ఆమె ముఖం చూశాడు సురేంద్ర.

ఆమె అమాయకంగా అతడి కళ్ళల్లోకి చూసింది. ఆ చూపులోనే ఆమె గడిచిన జీవితాన్ని అతడు గ్రహించగలిగాడు. కాని ఆమె ఆత్మస్థైరాన్ని అంచనా వెయ్యలేకపోయాడు.

సురేంద్ర పుస్తకాలు మరునాడే తెచ్చాడు కాని ఆమె చేతికివ్వలేదు. ప్రొఫెసరు టేబుల్ మీద పెట్టాడు.

''ఎలా చదువుతావే ? పుస్తకాలు లేవు. ఫీజు వరకూ సంపాదిస్తాననుకో, ఆ కాలేజికి ఈ బట్టలతో వెళ్తావా ?" తల్లి అడిగింది ఇంటికి రాగానే.

"అమ్మా, నడుస్తూంటే దారి అదే దొరుకుతుంది. దృఢనిశ్చయం ఉంటే ముందుకు సాగటానికి ధైర్యం అదే వస్తుంది. ఇవాళ ప్రొఫెసరుగారు తనంతట తానే గదిలోకి పిలిపించి, ఒకరిచేత పుస్తకాలిప్పిస్తానన్నారు. నిన్ను ఇబ్బంది పెడుతున్నానన్న బాధేకాని నేను సర్దుకుపోగలను. మన ఊళ్ళో సంపాదించిన డబ్బు కొంతఉంది. రేపు బట్టలు అత్యవసరమైనవి కొంటాను. నీకు అమర్యాద కలగకుండా ఈ కాలేజిచదువు నెట్టుకువస్తాను సరేనా ?" తల్లికి ధైర్యం చెప్పింది.

సురేంద్ర దగ్గర్నించి వచ్చిన పుస్తకాలు ప్రొఫెసరు ఆమెకు అందజేశాడు. ఆమె రాత్రి పొద్దుపోయేవరకూ చదువుకుని పడకచేరింది. వేళ తప్పినందు వల్ల నిద్రరాలేదు. గతస్మృతులు కళ్ళముందు బొమ్మ కట్టాయి.

స్వగ్రామంలో చిన్ననాటి స్నేహితురాలు మనోరమా తనూ నెలకు నూరు

రూపాయల జీతంమీద అక్షరాస్యతా పథకంకింద నియుక్తులయ్యారు. ఇద్దరూ గుడిసెలలోకి వెళ్ళి, వాళ్ళ పిల్లలకు అక్షరాలూ అంకెలూ నేర్పాలి. కనీసం రోజుకు రెండుపూటలు తిరగాలి. ఒక్కో పేరు, పిల్లలసంఖ్య వాళ్ళపేర్లూ రిజిస్టర్లో రాయాలి. ఒకరు పలకలసంచీ, ఒకరు రిజిస్టర్లూ పట్టుకుని పొద్దున ఎనిమిది గంటలకు గుడిసెలవైపుకు వెళ్ళేవారు.

మొదటిరోజు "మనూ నీకొచ్చే నూరు రూపాయలజీతం ఏంచేస్తావే ?" తన చెయ్యిపట్టుకుని గబగబ నడుస్తున్న మనోరమనడిగింది శాంతి.

ఇద్దరూ జడలూపుకుంటూ నడుస్తున్నారు, పదహారూ పదిహేడేళ్ళ పిల్లలు. పదవక్లాసు ప్యాసయ్యారు. వాళ్ళకు పెళ్ళిళ్ళు చేయాలని పెద్దవాళ్ళ తొందర. ఎంత కట్నం పొయ్యాలోనని తల్లుల ఆందోళన. ఎక్కడినుంచి తేవాలన్న తండ్రుల మథన. పెళ్ళి చూడాలని ముత్తాత తల్లుల ఆతురత. కాని వరుడెక్కడ దొరుకుతాడు ?

శాంతి తండ్రి పెళ్ళికొడుకుల వేటలోనే కాలంచేశాడు. తల్లి సంసారం గడపటమెట్లా అని రోజులు గడుపుతున్నది, తనకు చేతనైన పనులుచేస్తూ.

శాంతి అడిగిన ప్రశ్నకు "నేను ఎన్నాళ్ళనుంచో ఒక సిల్కుచీరె కొందా మనుకుంటున్నాను. ఇంటిసంగతి నీకు తెలుసుగా ! పడనివ్వరు" అన్నది వెంటనే మనోరమ.

"మా అమ్మకు నిండుచీరె ఒక్కటే ఉంది. దాన్ని పగలు కట్టుకుంటుంది. రాత్రిళ్లు రెండుముక్కలు అతుకుపెట్టిన చీరె కట్టుకుంటుంది. అమ్మకు ఒక్క చీరయినా కొంటాను" అంది శాంతి.

"అట్లా అయితే మనం ఈ జన్మలో చీరెలు కొనుక్కున్నట్టే" అనుకుంది మనోరమ.

ఇంటి పరిస్థితులను తలుచుకుంటూ మౌనంగా ఇద్దరు ఆ కాలనీ చివర నున్న గుడిసెల దగ్గరకొచ్చారు. అక్కడ చిన్నపిల్లలు ఒంటికి గుడ్డలు లేకుండా తిరుగుతున్నారు. వాళ్ళతో పాటు పందులూ వాటి పిల్లలు మురికిగుంటలు ముట్టె లతో కెలికి బురదను చిందగొడుతున్నాయి. తల్లులు పాచిపనులకు బయలుదేరు

తున్నారు. మగవాళ్లు పారలు, గంపలు తలలకెత్తుకుని కూలీపనులకు బయలుదేరు తున్నారు.

మనోరమ శాంతి, నడుస్తున్న ఆడవాళ్ళకెదురుగా నిలబడి "ఒక రెండు నిమిషాలాగండి. మీతో మాట్లాడాలి" వాళ్ళను నిలవేశారు.

"మేము పాచిపనిచేసి ఆడినుంచి కూలీపనికి పోవాల. అమ్మలూ, మాతో పనేటిది ?" అంది వాళ్ళలో ముందుకువచ్చిన మాలక్ష్మి.

"పోవచ్చులే, ఒక్కనిమిషమాగలేవా ?" మనోరమ చికాకుపడ్డది.

"ఉండవే, నీకన్నిటికీ చికాకు అని పనికివెళ్లతున్న వాళ్ళవైపు తిరిగి "నీ పేరు మాలక్ష్మి అన్నావు కదూ? మాలక్ష్మి, మేము మీపిల్లలకు చదువుచెప్పటానికి వచ్చాము. నీకెంతమంది పిల్లలు ?" నెమ్మదిగా అడిగింది శాంతి.

"ఆ దేవుడిచ్చినంతమంది, ఆ లెక్కలెందుకు మీకు అమ్మలూ ?"

"మీ బాగుకోసమేనమ్మా మేము వచ్చింది. మీ పిల్లలు చదువుకుంటే కొలువులు చేసుకుని బాగా బతుకుతారు కదా. మీరు పడుతున్న కష్టం వాళ్లు పడనక్కరలేకుండా సుఖంగా ఉంటారు, అందుకని అడిగాను."

"ఐదుగురు పిల్లలు. పెద్దది పదేళ్ళది, చిన్నదానికి ఆరోనెల."

"పెద్దదాన్నీ చిన్నదాన్నీ వదలిపెట్టి మధ్య వాళ్ళకు చదువు చెప్పమంటావా ? లేక- పైముగ్గురికీ చెప్పమంటావా ? చెప్పు ?" అడిగింది శాంతి.

"దొరసాన్లు బాగనే ఉన్నారు. పిల్లగాడు గంజిబువ్వతిని దుకాణంలో పని చెయ్యబోతడు. పెద్దది పిల్లలను చూసుకుంటూ, మేం వచ్చేసరికి ఇంతబువ్వ వండి ఉంచుతది. మాకేడ కుదురుద్ది మీ సదువులు ?"

"అది కాదు మాలక్ష్మి, చదువుకుంటే ఎంతలాభమో ఒకరిని చదివించి చూడు, ఒక్క గంటసేపేకదా. తరువాత మీపనులు మీరు చూసుకోవచ్చు. మీకందరికీ చదువు చెప్పమనీ, శుభ్రంగా ఉండాలని బోధించమనీ సర్కారు వారు మమ్మల్ని పంపించారు."

"ఏంది తల్లులూ ? సర్కారెట్ల పంపించినరు ? మీరెట్ల వచ్చినరు ? మాకు

కడుపునిండ తిండిలేదు, ఒంటికి గుడ్డలేదు. ఉండేటందుకు గుడిసె లేదు. ఈ గుడిసెకు నెలకు నాలుగురూపాయిలు కట్టాల. లీడర్లకు మా బాగోగులు చూడానికి రెండురూపాయ లివ్వాల. మేము ఎండకు ఎండి- వానకు తడిసి, చలికి నీలుక్కు-పోయి సస్తాఉంటే సదువు చెప్పమని పంపినరా? మీలాగ మేము శుబ్బరంగ ఉండ మంటే ఎట్లుంటము తల్లీ ? ఈ సదువులు శుబ్బరాలు కూడు పెడతవా ? గుడ్డ లిస్తయా ? మమ్మల్నిట్ట బతకనీయండి యెల్లండి. యెల్లండి. మాకు పొద్దుపోతది" తిరిగి చూడకుండా కేకలుపెడుతూ వెళ్ళిపోయారు.

శాంతి మనోరమ నీరుగారిపోయారు.

వాళ్ళ కలలు కరిగిపోయాయి.

కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

కొంతసేపటికి శాంతి తేరుకుని ''మనూ, మనం ఆఫీసరు దగ్గరికి పోయి ఇదంతా చెబితే చివాట్లుపెట్టి ఈ నూరురూపాయల ఉద్యోగం ఊడేటట్టు చేస్తాడు. ఏదయినా ఉపాయం ఆలోచిద్దాం."

ఇద్దరూ చేతులుపట్టుకుని దారివెంట నడుస్తూఉండగా ఒక చెట్టుకింద చిన్న దుకాణం కనబడ్డది. పావలాబిళ్ళంత బిస్కెట్లు సీసాలల్లోపోసి అమ్మకానికి పెట్టు కున్నాడు కొట్టు యజమాని.

శాంతికి తటాలున ఒక ఆలోచన మెరుపులామెరిసింది. ఎప్పటినుంచో సంచీలోదాచుకున్న రూపాయ నోటొకటి బైటకితీసి కొట్టుముందరకెళ్ళి "బిస్కెట్లు ఎట్లా ఇస్తావ"ని అడిగింది.

యజమానికి కళ్లు మిలమిల్లాడాయి. వాటిని దుకాణంలోపెట్టి నాలుగు నెల లయింది. వాటిని అడిగిన వాళ్లులేరు. అయినా వ్యాపారదృష్టితో మాట్లాడే అలవాటు కనుక "పదిపైసలకు రెండు" అన్నాడు.

శాంతి అతడి ముఖ కవళికలనుబట్టి గ్రహించింది.

"ఏదీ ఒకటిల్లా ఇవ్వు చూస్తాను"

అతడొకటితీసి చేతిలోపెట్టాడు. ఆమె నోట్లోవేసుకునిచూసి "పాతసరుకు-తీపి చచ్చిపోయింది. అవన్నీ ఒక రూపాయకిచ్చినా నీకు ఎంతోలాభం" అంది.

"పద బుల్లెమ్మా. నీవడిగితే కాదనలేను పద" అంటూ వెనక్కు తిరిగింది శాంతిని వెంటబెట్టుకుని.

మళ్ళీ అదే మురుగుకాలవలూ-వాసన ఆ దోమలూ-ఆ కుక్కలూ పందులూ కడుపులో తిప్పినట్లయింది శాంతికి. బట్టతో ముక్కుమూసుకుంది

"ఈ బస్తీ మురుగువాసన కొట్టుది నీ వెందుకొచ్చినవేతల్లీ ముక్కుకుబట్ట అడ్డం పెట్టుకునేదానవు? మేముండేదే ఇక్కడ" పోచమ్మకు పిసరంత కోపం వచ్చింది.

శాంతి ముక్కుకు అడ్డంపెట్టుకున్నబట్టను తీసేసింది. తనను చూడగానే పరుగెత్తుకుంటూవచ్చిన పిల్లలనుచూసి పెదవులమీదికి నవ్వుతెచ్చుకుని "మీరంతా ఏంచేస్తున్నారు?" అడిగింది.

"గోటీబిళ్ళలాడతం. గోలీలాడతం. గుడిసెల్లో ఎవరూ జొరబడకుండ చూసుకుంటం" అన్నారు.

"మీరంతా నేను చెప్పినట్టువింటే బిస్కెట్లుఇస్తాను. అందరూ వరసగా కూచోండి" అంటూ బిస్కెట్లు చూపించింది.

వాటినిచూస్తూ అందరూ కూర్చున్నారు.

శాంతి అక్షరాలు అంకెలూ పదిసార్లనిపించి రెండేసి బిస్కెట్లిచ్చి" రేపు కూడా వస్తాను. మీరిట్లా నేను చెప్పినట్టుఅంటే మళ్ళీ బిస్కెట్లిస్తా. మీరు రమ్మంటే రోజూవస్తా, రమ్మంటారా?"

"రా రా."

శాంతి ఆ బస్తీపేరు, పిల్లలపేర్లు, రిజిస్టరులో రాసుకుంది. నలభైమంది పిల్లలు ఆ బస్తీలోనేతేలారు. శాంతి ఇంటికివెళ్తూ ఆఫీసుకువెళ్ళి రిజిస్టరుచూపించి సంతకంపెట్టింది.

"రెండు బస్తీలకేనా వెళ్ళింది?" అన్నాడు అధికారి పెదవులుచప్పరిస్తూ.

"ఆ రెండుబస్తీలకూ వెళ్ళటానికి ఎంతకష్టపడవలసి వచ్చిందో వివరించింది శాంతి.

ఆడపిల్లలుగాని మగపిల్లలుగాని ఈ స్కీములో పనిచెయ్యటానికి ముందుకు రావటంలేదు. ఈ నూరు రూపాయలకూ ఎవరొస్తారని ముఖం తిప్పుకుంటున్నారు. ఎవరూరాకపోతే ఊరిపిల్లలను అందరినీ ఒకచోటచేర్చి ఆయన చదువుచెప్పాలి. అది ఆ ఊళ్లో సాధ్యంకానిపని. పని జరగకపోతే ఆయనకా ఉద్యోగం ఊడిపో తుందని భయం. అయినా అధికారికనుక "ఇంకా ఎక్కువమంది వచ్చేటట్టు రేపయినాచూడు" అని హెచ్చరికగా అన్నాడు.

తలఊపి ఇంటికివచ్చి చీరె మార్చుకుంది. కడుపులో ఆకలి మండి పోతున్నది. రెండుగ్లాసుల మంచినీళ్లతాగి నులకమంచమ్మీద ఒరిగింది.

పెరట్లో చెట్టుకింద విస్తళ్లకుడుతున్న తల్లి గబగబా లోపలికివచ్చి "అన్నం పొయ్యిమీద పెట్టాను, ఉడుకుతున్నది. అంతవరకు ఈ అటుకులూ బెల్లం తింటూ ఉండు" అని గుప్పెడు అటుకులూ బెల్లంముక్క చేతిలోపెట్టింది.

"భోజనంచేసి మళ్ళీ పలకలసంచీ తీసుకువెళ్ళనవసరం లేదుగా? రేపు పొద్దున్నవరకూ హాయిగాపడుకో అన్నీ మరిచిపోయి" అన్నది తల్లి.

ఆ మరునాడు కొంచెం పొద్దెక్కిన తరువాత చింతలతోపు దాటి ఒక బస్తీకి వెళ్ళింది. అక్కడ గుడిసెలముందర నులకమంచాలమీద కాళ్లుచేతులు కదిలించ లేనివాళ్ళూ వృద్ధులూ పడుకునిఉన్నారు. వాళ్ళకు పిల్లలు జొన్నగటక మూకుళ్లలో పెట్టి తినిపిస్తున్నారు. కొంతమంది పిల్లలు అంబలి తాగిస్తున్నారు మొత్తం ఇరవై మంది వరకూ ఉన్నారు.

"నిన్న ఆ బస్తీకివచ్చి నోళ్ళా?" అన్నారు ఒకరిద్దరు పిల్లలు శాంతిని చూడగానే బిస్కెట్లమీద ఆశతో.

"అవును మీరు గటకతినేవరకూ ఇక్కడ కూర్చుంటాను. రండి ఒక పావు గంటలో పిల్లలందరు మంచాలకెదురుగా పోగయ్యారు. శాంతి కూర్చోటానికి పలకరాయొకటి తెచ్చివేసారు ఆమె పిల్లలకు అక్షరాలు అంకెలూ నోటపలికిస్తూ ఉంటే, పెద్దవాళ్లు లేచికూర్చుని వాళ్ళూ వల్లించటం మొదలుపెట్టారు. ఒక గంట సేపయిన తరువాత వాళ్ళకు బిస్కెట్లుఇచ్చి పిల్లలపేర్లూ బస్తీపేరూ రిజిష్టరులో ఎక్కించుకుంది. అక్కడినుంచి కదిలేముందర "నాకింకో బస్తీ మీలాంటి పిల్ల లున్నది చూపించగలరా?" అడిగింది శాంతి.

"వాళ్ళకు కూడా బిస్కెట్లిస్తవా?" అడిగాడొకడు.

"ఇస్తాను"

"రా చూపిస్త" అంటూ మారుమూల నున్న బస్తీ ఒకటి చూపించాడు. ఆ బస్తీని చూడగానే శాంతికి చాలా సంతోషం గలిగింది. చాలామంది పిల్లలు కనబడ్డారు. వాళ్ళు కొంచెం పెద్దపిల్లలే. ఆడమగ కలిసి ముప్పయిమందికి పైగా చెట్లకింద పుల్లలేరుతున్నారు.

వాళ్ళకు కబుర్లుచెబుతూ అక్షరమాలంతా నోటితో చెప్పించింది. అంకెలు చెప్పించింది. బిస్కెట్లు ఇస్తూ "నేను రోజూ వస్తాను. మీకివి నోటికి వచ్చిన తరువాత పలకలమీద రాయాలి. మాటలు రాయాలి" అని వాళ్ళచేత పాటలు పాడించి ఉల్లాసంగా మాట్లాడించి ఒంటిగంటకు ఇంటికి వచ్చింది.

ఒక నెలరోజుల్లో వాళ్ళందరి చేత పలకలమీద అక్షరమాలంతా రాయించింది. అంకెలు నూరు వరకూ రాయించింది. ఆ తరువాత మాటలు రాయించింది.

ఆమె రిజిస్టర్లో తోటివాళ్ళకంటె పిల్లల సంఖ్య అధికంగానే ఉంది. ఒక రోజయినా వదిలిపెట్టకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.

ఆరు నెలల తరువాత ఊళ్ళల్లో అక్షరాస్యతా కార్యక్రమం ఎట్లా జరుగుతున్నదో చూడటానికి ఒక అధికారి వచ్చాడు. ఆ ఊళ్లో నియమింపబడిన నలుగురు తమ రిజిస్టర్లను చూపించారు. ఆ అధికారి వాళ్ళు తిరిగిన బస్తీలన్నీ వాళ్ళతోతిరిగి చూశాడు.

ఆయన వెళ్ళిన నాలుగురోజులకు శాంతికి ఆ ఊరినుంచి ఇంకోఊరు బదిలీ చేసినట్టుగా ఆర్డరు వచ్చింది. తల్లితో కూడా బయలుదేరింది శాంతి. ఆ ఊరు కొంచెం పెద్దది. ఒక కాలేజికూడా ఉంది. శాంతి అక్కడ సాయంకాలం వరకూ పిల్లలకు చదువు చెప్పిన తరువాత కాలేజిలోచేరే అవకాశం కలిగింది.

అక్కడి పిల్లలూ, పెద్దవాళ్ళూ, శాంతి ఇంటరు చదివేటప్పటికి వాళ్లి రెండు తరగతులు పూర్తిచేశారు ఆమెకు ఆ ఊరు రాగానే జీతంకూడా ఎక్కువయింది.

తను ఇప్పుడు మెడికల్ కాలేజిలో చేరింది. గతస్మృతులు ఒళ్ళు జలదరింప చేశాయి. అయినా ఆ అనుభవం తనకు భవిష్యత్తులో ఉపయోగపడవచ్చునను

కుంటూ లేచింది. ఒక్కొక్క సంవత్సరంలో అనుభవం పాఠం నేర్పినట్టుగా అని పించింది. శవాలను చూసి మొదట బెదిరినా తరువాత అలవాటయింది. రోజులు ఆమెకు తెలియకుండానే గడిచిపోయాయి. కోర్సు పూర్తిచేసి హవుస్‌సర్జన్సీకూడా చేసింది. అంతవరకూ కూతుర్ని కనిపెట్టుకుని ఉన్న తల్లి మరిచూడలేక కన్ను మూసింది.

ప్రభుత్వం వారు పల్లెలలో పనిచెయ్యటానికి వెళ్తామన్న వాళ్ళకు ముందర ఆర్డరు కాగితాలు చేతిలో పెట్టారు.

శాంతి వెళ్ళిన ఊళ్ళో ఒక రేకులషెడ్డులో ఆస్పత్రి పెట్టారు. దానిలో తడకలతో రోగులను పరీక్షించటానికీ డాక్టరు కూర్చోవటానికి ఏర్పాట్లు చేశారు. ఆ గ్రామానికి తగినట్టుగా హంగులేర్పరచారు. కాని రోగులెవ్వరూ రారు. నాలుగు రోజులు చూసి శాంతి కంపౌండరు నడిగింది.

"ఎవరూ ఈ ఊళ్ళో రారమ్మా. వచ్చినవాళ్ళకు నేనే ఇంతమందు కలిపి సీసాలోపోసి ఇస్తా" నన్నాడు.

"మరి, ఈ ఆస్పత్రికి మందులు శాంక్షను కాలేదా ? ఇంతకాలం నుంచీ ఇట్లాగే నడిచిందా ? ఇదివరకూ ఉన్న డాక్టరుగారు ఊరుకున్నారా ?"

"నాకు ఆ సంగతులు తెలియవు డాక్టర్."

శాంతి ఆస్పత్రి కవసరమయిన మందులకోసం పైకిరాసింది. తనే నర్సునూ, ఆయాను, కంపౌండరునూ తీసుకుని ఇంటింటికీ వెళ్ళి చూసింది. ఇంటింటా రోగు లున్నారు. దీర్ఘవ్యాధులతో బాధపడుతున్నారు.

కంపౌండరును చూడగానే "నీ రంగునీళ్ళతో రోగాలు కుదుర్తాయా ? అందుకే మేము రావటంలేదన్నారు."

శాంతి ఆశ్చర్యపోయింది.

"ఆ రోగులందరినీ పరీక్షచేసి "నేను మందులు తెప్పిస్తున్నాను, పైనుంచి మందులొస్తాయి. నేనే మీదగ్గరకొచ్చి ఇంజక్షనులిస్తాను. మీకేం భయం లేదు. ఇవన్నీ ఆ మందులతో తగ్గిపోతాయి."

మందులు రాగానే ఇంటింటికీ వెళ్ళి ఇంజక్షనులు మాత్రలు ఏదవసర

మయితే వాటిని ఇచ్చి, తగ్గేవరకూ వెళ్ళి చూసేది. డాక్టరుమీద నమ్మకం కుదురు తున్నకొద్దీ రోగులు ఆస్పత్రికే రావటం మొదలుపెట్టారు.

శాంతికి ఆ గ్రామంలో జనాభాను చూడగానే ఒక ఆలోచన మనసులో మెదిలింది.

ఆస్పత్రికెదురుగా పెద్ద పెద్ద చెట్లున్నాయి. ఆ చెట్లకింద గొడ్లను కట్టేస్తున్నారెవరో. దోమలు, వాసన భరించలేకుండా ఉన్నారు. వచ్చే రోగులు కూడా విసుక్కుంటున్నారు.

"ఆ గొడ్లు ఎవరివి ?"

ఈ ప్రశ్న ఎవరిని అడిగినా సరియైన సమాధానం రాలేదు. వార్డుబాయ్ చేత ఆ గొడ్లకు కట్టిన తాళ్ళను విప్పించింది. అవి అరుచుకుంటూ ఊరంతా తిరగసాగాయి. వెంటనే పాలేరొకడు వచ్చి "డాక్టరమ్మా, ఆ గొడ్లు ఈ ఊరి పెద్దదొరగారివి. ఆ గొడ్లను ఊరిమీదికి తోలినారెందుకని అడగమన్నారు" అన్నాడు.

"ఇది ఆస్పత్రి. దోమలూ, వాసన ఆస్పత్రికెదురుగా ఉండకూడదు. పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండాలి అవి ఎవరివయినా గొడ్లు గొడ్లేకదా ? అయినా, ఆ స్థలం ప్రభుత్వానిదని నేను తెలుసుకున్నాను కలెక్టరుకు రాసి" అన్నది.

"ఎప్పటినుంచో ఆ గొడ్లను అక్కడే కట్టేస్తున్నాం కదా ?"

"కట్టేస్తున్నారేమో ? కాని రూల్సుకు వ్యతిరేకం"

ఆ స్థలంలో శాంతి రెండు పెద్ద పెద్ద పాకలు విద్యామంత్రితో చెప్పి వేయించి, ఇద్దరు టీచర్లను పిలిపించింది. వాటిలో ఆ గ్రామంలోని పిల్లలకు పాఠశాల పెట్టించింది.

టీచర్లు వేళకు వచ్చి కూర్చున్నప్పటికీ వారం రోజులు పిల్లలు రాలేదు.

శాంతికి అలవాటయిన పని, పిల్లలకు మిఠాయి పంచుతారని మనిషిచేత ఇంటింటికీ కబురుపెట్టి పిలిపించింది. ఆరోజు గ్రామపెద్దతో సహా ఊరంతా రావలసిందని కరపత్రాలు పంపించింది.

పాఠశాలను గ్రామపెద్ద చేతనే ప్రారంభం చేయించి ఆయనచేతనే మిఠాయి పిల్లలకిప్పించింది.

ఆ గ్రామంలో పాఠశాలలు తను రెండు పెట్టించినా విజయవంతం కాలేదు కనుక తానా ప్రయత్నం చెయ్యటంమానుకున్నట్టుగా చెప్పాడాయన. డాక్టరమ్మ ప్రయత్నమయినా విజయవంతమయితే సంతోషిస్తానన్నాడు.

ఆ మూడవనాడు పాకలు రెండూ తగలబడి పోయాయి.

శాంతికి ఆశాభంగమయింది. ఊరిని బాగుచేద్దామనీ, జులాయిల్లా తిరిగే పిల్లలు చదువుకుంటారనీ ప్రయత్నించింది, కాని అది కలిసిరాలేదు.

ఆ ఊరిపెద్ద ఇంతకాలంగా డాక్టర్లను చేతిలో పెట్టుకుని మందులన్నీ అమ్మించేవాడు. శాంతి వచ్చినప్పటినుంచీ ఆ మందులు చేతికి చిక్కటం లేదు. ఉన్నట్టుండి ఒక రాత్రివేళ ఆస్పత్రి తలుపులు పగలగొట్టి మందులన్నీ కాజేశారెవరో.

శాంతికి మరో ఓటమి ఎదురయింది.

పోలీసురిపోర్టు యిచ్చింది. ఒక్కరయినా వచ్చి చూడలేదు. శాంతి డి.యస్పీకి రిపోర్టు చేసింది. ఆయన తన కింది ఉద్యోగికి చెప్పాడు. ఆయన తన కింది అతడికి చెప్పాడు. ఆ ఉద్యోగి నలుగురు పోలీసువాళ్ళతో వచ్చి చూసి వెళ్ళాడు.

రోగులు రావటం తగ్గిపోయింది.

ఒకనాడు హఠాత్తుగా పోలీసు ఇన్స్పెక్టరు, డి.యస్పీగారు పిలుస్తున్నారని శాంతిని జీపులో తీసుకువెళ్ళాడు. శాంతికి అర్థంకాక ఎన్నో ప్రశ్నలు వేసింది ఇన్స్పెక్టర్‌ని. అతడు అరెస్టువారంటు చూపించాడు.

శాంతికి తలంతా తిరిగిపోయింది. డి.యస్పీ చెప్పిన కథనం ప్రకారం, శాంతి అజాగ్రత్తవల్ల గర్భముతో ఉన్న మనిషి చచ్చిపోయిందనీ, ఆ శవాన్ని గ్రామపెద్ద యింటిపక్క పడేయించిందనీ, సాక్షాధారాలతో ఆమెమీద కేసుపెట్టారు ఊరివాళ్లు.

రెండురోజుల తరువాత కేసు విచారణకు వచ్చింది.

ఆ గర్భిణీస్త్రీ తనవద్దకు రాలేదనీ ఒక రోగిని చూసి, తను యింటికి తిరిగి వస్తుండగా ఆస్త్రీ గ్రామపెద్ద యింటివెనక పడిఉంటే, తన వైద్యంవల్ల ఆమెకు కాన్పు అవుతుందేమోనని స్త్రెచర్‌మీద ఆస్పత్రికి తెప్పించిందనీ ఆమె కడుపుమీద తగిలిన దెబ్బల వల్ల కడుపులో బిడ్డ చనిపోయిందనీ ఆమె కోర్టులో జడ్జీముందర చెప్పింది. కాని, అప్పటికే గ్రామపెద్ద శవాన్ని పెద్దాసుపత్రికి పంపించి పోస్టుమార్టం చేయించిన రిపోర్టు పోలీసువారి దగ్గరకొచ్చింది. ఆ శవం ఒంటిమీద ఒక్క దెబ్బయినా లేదని తల్లి చనిపోయిన తరువాత బిడ్డ చనిపోయిందని పోస్టుమార్టం చేసిన డాక్టరు కోర్టులోకూడా చెప్పాడు.

కేసు వాయిదా పడ్డది.

సర్జన్‌గా పెద్ద నగరంలో జనరల్ హాస్పిటల్లో పనిచేస్తున్న డాక్టర్ సురేశ్ శాంతిని జైలులోనే కలుసుకున్నాడు.

ఇద్దరూ ముఖాలు మౌనంగా చూసుకున్నారు.

"ఏం జరిగింది శాంతీ" అతడు గద్గదస్వరంతో అడిగాడు.

"ఇంతజరిగిన తరువాత ఇప్పుడేం చేయగలరు ? గ్రామాభివృద్ధి కోసం ఏరికోరి ఆ ఊరు వేయించుకున్నాను. నేను చేసిన అభివృద్ధి అందరికీ ఇప్పుడు తెలిసిందిగదా ?" తలవంచుకుని శాంతి నోటివెంట ఒక్కొక్కమాటే వెలువడింది.

"శాంతీ, నిన్ను నీవే కించపరచుకోకు. నీ సామర్థ్యం నాకు తెలుసు. నీకు గ్రామాభివృద్ధిమీద ఉన్న అభిమానం తెలుసు. కాని, గ్రామస్తులు అమాయకులని అందరు అనుకొన్నట్టుగా, రాజకీయోపన్యాసాలలో విన్నట్టుగా లేరు. అఖండమైన తెలివితేటలున్నాయి వాళ్ళకు కాని సరియైన పంథాలేదు తలలుతీసి తలలు పెట్టగలరు. నీవే అమాయకురాలివి. ఈ సంగతి పేపర్లో చదివి అక్కడికి వెళ్ళి పరిస్థితులు తెలుసుకుని నేనే కేసు వాయిదా వేయించాను. ఈ లోపల పోస్టుమార్టమ్ చేసిన ఫొరెన్సిక్ డాక్టరుతో నేను మాట్లాడుతాను. పదిరోజులు సెలవు పెట్టాను.

నీవేం బాధపడకు. టయిమ్ అయిపోయినట్టుంది. ఒక్కసారి నీవు నవ్వితే ఆ నవ్వు ముఖం చూసి వెళ్తాను."

కన్నీళ్లతో మలినమైన ముఖంలో ఆశారేఖలు కనబడినట్టుగా నవ్వలేక నవ్వలేక నవ్వింది శాంతి.

పోస్టుమార్టం చేసిన డాక్టరు యింటికి సురేంద్ర వెళ్లగానే తలుపుతీసిన ఆయన అతడిని చూసి తెల్లబోయాడు.

"రిపోర్టు నీవిచ్చిందేనా మిత్రమా ?" అంటూ బుజమ్మీద చెయ్యేశాడు సురేంద్ర.

"ఇంతకూ ఆ నేరస్తురాలనబడే డాక్టరు ఎవరు ?" అతడు ఎదురుప్రశ్న వేశాడు చనువుగా.

"ఎవరయితేనేం ? ఒక లేడీడాక్టరు. గ్రామాభివృద్ధి అంటే పిచ్చి అభిమానం గలది. కోరికోరి తోడేళ్ళ మధ్య నలిగిపోయింది. ఇంతకూ నీవేనా ఆ రిపోర్టు యిచ్చింది ? ఆ గ్రామపెద్ద చేతికింద ఉండి, అ దౌర్జన్యాలను చూసి, డాక్టరు సహించలేక పోయినందువల్ల, కలిగిన దుస్థితి ఇది.''

"సురేష్, నన్ను క్షమించు. డి.యస్పీ దగ్గరుండి రిపోర్టు రాయించుకుని వెళ్ళాడు. నిజానికి శవం కడుపుమీద దెబ్బలు మోపుగా తగిలాయి. ఈ పోలీసు వాళ్ళంతా ఆయన చేతిలో వాళ్ళు. నన్ను సస్పెండ్ చేయిస్తానని బెదిరించాడు" సురేష్ చేతులు రెండూ పట్టుకున్నాడు.

కేసంతా తిరగతోడి నిజాన్ని బయటపెట్టించి శాంతిని నిర్దోషిఅని జడ్జీ చేత అనిపించటానికి వారంరోజులు పట్టింది సురేష్‌కి.

ఎవరికి ఏ విధమయిన శిక్షపడ్డదీ సురేష్ ఇంక వినిపించుకోలేదు. శాంతిని కారులో తనున్న నగరానికి తీసుకొచ్చాడు. ఆమెచేత సెలవు పెట్టించాడు.

ఒక సాయంత్రపువేళ చల్లగాలికి కూర్చుని కబుర్లలోపడ్డ సురేష్ శాంతిలు గ్రామాలలోని రాజకీయాలను చర్చించుకున్నారు కొంతసేపు, అ తరువాత—

"ఎప్పుడడిగినా 'చూద్దాంలే' అనే దానవు. ఇప్పుడైనా చూస్తావా నా అప్లికేషను ?" వెన్నెల వెలుగులో బాల్కనీలో శాంతి పక్కన కూర్చుని అడిగాడు సురేష్ వంచుకున్న ఆమె తలను రెండు చేతులతో పైకెత్తుతూ.

"చూసి శాంక్షన్ చేశాను" అంది ఆనంద బాష్పాలు తుడుచుకోటానికయినా తీరిక లేని శాంతి.